పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 24: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ, ఇతర అధికారులతో పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మార్చిలో ప్రారంభం కానున్న పరీక్షలకు జిల్లాలో మొత్తం 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 11,912 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. పరీక్షల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ అశోక్, డీఎస్పీ రవి, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఐఈఓ భానునాయక్, ఏసీజీఈ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపాలి

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

చిలుకూరు, ఫిబ్రవరి 24: ఈ నెల 27వ తేదీన జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిలుకూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోదాడ సబ్ డివిజన్ పోలీసులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో సీఐలు రజితారెడ్డి, చరమందరాజు, రాము, రామకృష్ణారెడ్డి, చిలుకూరు ఎస్ఐ రాంబాబుగౌడ్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

నాగారం: ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం, ఫిబ్రవరి 24: మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాతి రమేశ్ భార్య రాణి ఇటీవల మృతిచెందగా.. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సూచనల మేరకు మాచిరెడ్డిపల్లి బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాణి కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.23,500 ఆర్థిక సాయంగా అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఆత్మకూర్.ఎస్: సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పీఓపీ వర్కర్లు

పీఓపీ వర్కర్ కుటుంబానికి..

ఆత్మకూర్.ఎస్: మండలంలోని ఏనుబాముల గ్రామంలో ఇటీవల మృతిచెందిన పీఓపీ వర్కర్ చింతకుంట్ల సుధాకర్ కుటుంబానికి సూర్యాపేట పీఓపీ సీలింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి చేతులమీదుగా సోమవారం రూ.33 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎన్ పీఓపీ సీలింగ్ షాప్ నిర్వాహకుడు రఫీ, పీఓపీ సీలింగ్ మేస్త్రీలు పాషా, వీరేందర్, ఫూల్‌చంద్, ఆనంద్, నియాజ్, ఎడ్ల నవీన్, అలెగ్జాండర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని లింగగిరి జడ్పీహెచ్ఎస్‌లో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, రాధాదుర్గా, పతంజలి, మూర్తి, పూర్వ విద్యార్థులు కోటేశ్వరరావు, జానీపాషా, నాగరాజు, రవి, కనకారావు, గోపి, నాగయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన


క్షయ వ్యాధిపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ లక్ష్మి

మఠంపల్లి, ఫిబ్రవరి 24: కేంద్ర గనుల మంత్రిత్వశాఖ ఆదేశానుసారం హైదరాబాద్‌లోని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ఎస్‌సీఎల్ వర్కర్స్ కాలనీలో పరిశ్రమ మెడికల్ ఆఫీసర్ కె.లక్ష్మి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాల పైబడి దగ్గు, ఆయాసం తదితర సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో క్షయ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించాలి

- అనర్హులకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయరాదు
- రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్

సూర్యాపేట: ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ.గౌతమ్, పక్కన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 24: ఇందిరమ్మ ఇండ్లకు అర్హులనే గుర్తించాలని, అనర్హులకు ఒక్క ఇంటిని కూడా మంజూరు చేయరాదని రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల వివరాలు యాప్‌లో నమోదు చేయడంలో సూర్యాపేట జిల్లా రెండో స్థానంలో ఉన్నదని తెలిపారు. ప్రతి మండలంలో ఇద్దరు సుతారీ మేస్త్రీలకు న్యాక్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. మహిళా సాధికారత కోసం ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ప్రతి మండలంలో రెండు ఇటుకల తయారీ కేంద్రాలను , రెండు సెంట్రింగ్ సామగ్రి యూనిట్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పూర్తిచేయడానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ అప్పారావు, హౌసింగ్ ఎస్ఈ వెంకటదాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ బెడ్రూమ్ ఇండ్ల పనుల పరిశీలన..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న సింగిల్ బెడ్రూమ్ ఇండ్ల పనులను వీపీ.గౌతమ్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఎస్ఈ వెంకటదాస్ రెడ్డి, ఏఈ సాయిరాం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్ట్ తాడువాయి సందర్శన..

మునగాల: మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన తాడువాయి గ్రామాన్ని కలెక్టర్‌తో కలిసి వీపీ.గౌతమ్ పరిశీలించారు. గ్రామానికి 108 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. కాగా, గ్రామానికి చెందిన నిరుపేదలు మానెపల్లి మంగమ్మ, మానెపల్లి ప్రమీల తమకు ఇండ్లు రాలేదని కలెక్టర్‌కు మొరపెట్టుకోవడంతో స్పందించిన కలెక్టర్ కార్యదర్శి రామునాయక్‌ను పిలిచి మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఏఈ వసంత పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన..

నడిగూడెం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని వీపీ.గౌతమ్ పరిశీలించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ సరిత, ఎంపీడీఓ సంజీవయ్య పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని కార్యదర్శులు

- మధ్యాహ్నానికే పంచాయతీ కార్యాలయాలకు తాళం
- ప్రజలకు అందుబాటులో ఉండని వైనం


మధ్యాహ్నం ఒంటి గంటకు తాళం వేసి ఉన్న మూసీఒడ్డు సింగారం పంచాయతీ కార్యాలయం

మధ్యాహ్నం తాళం వేసి ఉన్న పాలకవీడు పంచాయతీ కార్యాలయం


మూసి ఉన్న యల్లాపురం పంచాయతీ కార్యాలయం

పాలకవీడు, ఫిబ్రవరి 24: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా పంచాయతీ ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయి. దీనికి తోడు కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల కార్యదర్శులు మధ్యాహ్నం వరకు పంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేసి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వేళలో కార్యాలయాలకు హాజరుతున్న కార్యదర్శులు ఆపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కార్యదర్శులు సమయ పాలన పాటించడం లేదని ప్రజలు చెబుతున్నారు. సోమవారం పాలకవీడు మండల కేంద్రంతో పాటు యల్లాపురం, మూసీఒడ్డు సింగారం, కోమటికుంట పంచాయతీ కార్యాలయాలకు మధ్యాహ్నానికే తాళాలు వేసి వెళ్లారు. దీనిపై ఆయా కార్యదర్శులకు ఫోన్ చేయగా తొలుత ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా అక్కడ కూడా లేకపోవడం గమనార్హం. దీంతో మరోసారి ఫోన్‌లో ప్రశ్నించగా ఐటీ రిటర్న్ దాఖలు చేయడానికి వెళ్లినట్లు అందరు కార్యదర్శులు ఒకే విధమైన సమాధానం ఇచ్చారు.

చర్యలు తీసుకుంటాం..

కాగా, కార్యదర్శులు అందుబాటులో ఉండకపోవడంపై ఎంపీడీఓ లక్ష్మిని వివరణ కోరగా.. కార్యదర్శులు కచ్చితంగా సమయ పాలన పాటించాల్సిందేనని తెలిపారు. ప్రతి రోజు తాను కొన్ని గ్రామాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమయ పాలన పాటించని కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'చిల్లేపల్లి టోల్‌గేట్‌ను ఎత్తివేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని చిల్లేపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్‌ను తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడలోని నేషనల్ హైవే నుంచి చిల్లేపల్లి టోల్‌గేట్ వరకు కేవలం 38 కిలోమీటర్లు మాత్రమే ఉన్నదని, హైవే నుంచి టోల్‌ప్లాజా ఏర్పాటు చేయడానికి కనీసం 60 కిలోమీటర్ల దూరం ఉండాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను ఎత్తివేయాలన్నారు. ఒకవేళ టోల్‌గేట్‌ను అక్కడే ఉంచితే 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల వారికి ఉచిత సౌకర్యం కల్పించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్రరాజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిపై ఫిర్యాదు


సీఐ వీరరాఘవులుకు ఫిర్యాదు చేస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 24: ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 13న సూర్యాపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్యవైశ్యులను దుర్భాషలాడిన ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేయాలని కోరుతూ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మీలా వంశీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరరాఘవులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త ఇమ్మడి సోమనర్సయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమావేశంలో లక్ష్మీనారాయణ ఆర్యవైశ్యులను కించపరిచేలా మాట్లాడారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు గుండా శ్రీధర్, చింత వెంకన్న, యామా సంతోశ్, మహంకాళి శివ, తల్లాడ కృష్ణమూర్తి, మాద్గుల శంకర్, కొత్త వెంకటేశ్వర్లు, కర్నాటి వంశీ, కొత్త వెంకన్న, వంగవీటి రమేశ్, దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి : ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 24: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రైమరీ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, మానసిక, శారీరక ధారుఢ్యానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములూరి వాగు నుంచి 3 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అమరవరం గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లు బొడ్డు వెంకటేశ్వర్లు, గుగులోతు సైదులు, గొల్లగోపు శ్రీనుతో పాటు ఓనర్లపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : తాసీల్దార్

తిరుమలగిరి, ఫిబ్రవరి 24: మన ఇసుక–మన వాహనం కింద సాండ్ టాక్సీలో బుక్ చేయని ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధి తాటిపాముల, నందాపురంలోని ఇసుక రీచ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

పాఠశాలలో బోరు మోటారుకు మరమ్మతులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 24: మండలంలోని అన్నారం(ఎన్) గ్రామ ఉన్నత పాఠశాలలో బోరు మోటారు ఏడాది నుంచి పనిచేయకపోవడంతో విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయురాలు రాధ సూర్యాపేటకు చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు దాచేపల్లి సుధీర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సుధీర్‌కుమార్.. తన మిత్రులు బంగారు సుధాకర్, సోమా సందీప్, దాచేపల్లి అంజయ్య సహకారంతో రూ.35 వేలు ఖర్చు చేసి సోమవారం మోటార్‌ను బాగు చేయించి విద్యార్థుల సౌలభ్యం కోసం పాఠశాలలో నల్లాలు బిగించారు.

ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సందీప్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 24: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్ఆర్సీ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు మెహిందికార్ సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు పిడమర్తి నాగేశ్వరి, ఉపాధ్యక్షుడు కోటాచారి తెలిపారు.

'రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి'

నూతనకల్, ఫిబ్రవరి 24: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం నూతనకల్‌లోని తొట్ల మల్సూరు స్మారక భవనంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు పంట పెట్టుబడుల కోసం అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో పోరాడుతామని అన్నారు. సమావేశంలో నాయకులు రాఘవులు, సైదులు, అవిలయ్య, చంద్రమౌళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 24: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. మండలంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. విదార్థులు చెడు స్నేహాలను వదిలేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని సన్మార్గంలో నడువాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో అవసరమున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీపడదగిన కేసులను రాజీ చేసుకొని శాంతియుత జీవనాన్ని కొనసాగించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిలుకూరు, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన చిలుకూరు గ్రామ పరిధిలోని కవిత జూనియర్ కళాశాల వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపు వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.అతివేగమే ప్రమాదానికి కారణంగా గుర్తించిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి : ఎంఈఓ

నడిగూడెం, ఫిబ్రవరి 24: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు మెరుగుపర్చాలని ఎంఈఓ ఉపేందర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు నందిగామ రామారావు, గురుస్వామి, గోవర్ధన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

అర్వపల్లి, ఫిబ్రవరి 24: జాజిరెడ్డిగూడెం గ్రామంలోని మాల కాలనీకి నాలుగు నెలలుగా గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా చేసే తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనేకసార్లు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిధులు లేకపోవడంతో తామేమీ చేయలేమని చెబుతున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గండమల్ల ఎల్లేశ్, పగిడిమర్రి శ్రీరాములు, నాగయ్య, శాంతయ్య, సాయిలు, సోమయ్య తదితరులు ఉన్నారు.

'సమాన పనికి సమాన వేతనం అందించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కోదాడ రూరల్, ఫిబ్రవరి 24: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు కోటగిరి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన పట్టణ టైలరింగ్ వర్కర్ల నూతన వేతన ఒప్పంద సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎం.ముత్యాలు, ఎస్‌కే.చాంద్‌పాషా, సూర్యం, నాగచారి, పురుషోత్తం, ఎస్‌కే.జాని, ఎం.నాగయ్య, ఎస్‌కే.ఖాజా, పాషా, మస్తాన్, వీరారెడ్డి, పుల్లాచారి పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 24: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయకుంటే పట్టభద్రుల ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి హెచ్చరించారు. సోమవారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లుగా నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో డిగ్రీ, పీజీ పూర్తయినా ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మహేశ్, నవీన్, వినయ్, పవన్, రాజు, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో రైతు అవగాహన సదస్సు

గరిడేపల్లి, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో జీవన ఎరువులు, పంటల సాగుకు విత్తనాల ఎంపిక, పండ్ల మొక్కలు, కూరగాయల నారు పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ, ఎరువుల వాడకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు కేవీకే ద్వారా అందిస్తున్న సేవలపై వివరించారు. అంతకు ముందు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన నగదు బదిలీ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్, ఇన్‌ఛార్జి హెడ్ డి.నరేశ్, శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, ఎ.నరేశ్, సీహెచ్.నరేశ్, సోమేశ్వరరావు, ఎస్.నరసింహారెడ్డి, లయోలా కాలేజీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని అనాజిపురం మోడల్ స్కూల్ విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కోడి లింగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో అర్వపల్లి మండల కేంద్రంలో యోగానంద లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఇంటర్ విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకొని రూ.20 వేల నగదు ప్రోత్సాహకం అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 20 నుంచి 23 తేదీల్లో వికారాబాద్ ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కబడ్డీ క్రీడల్లో ఇంటర్ సీఈసీ విద్యార్థులు తృతీయ బహుమతి గెలుచుకున్నారని వెల్లడించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పీడీ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.గురుచరణ్, అధ్యాపకులు ఉన్నారు.

'విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం'

విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న హెచ్ఎం రాములు నాయక్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 24: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని రామాపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములు నాయక్ అన్నారు. సోమవారం పాఠశాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులకు పాఠశాల పీడీ గంధం రంగారావు రూ.10 వేల విలువైన షూలను హెచ్ఎం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.